వైభవంగా హనుమాన్ జయంతి


ప్రతాప్‌నగర్‌లో హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

భక్త వల్లభుడు ఆంజనేయ స్వామి జయంతి వేడుకలను ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. పౌర్ణమి శుభ వేళ హనుమాన్ జయంతి రావడంతో ఈ రోజుకు ఎంతో ప్రత్యేకత ఏర్పడింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఖైరతాబాద్, ఫిలింనగర్ సోమాజిగూడ ప్రాంతాల్లోని ఆంజనేయ స్వామి ఆలయల్లో తెల్లవారుజాము నుంచే ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. – బంజారాహిల్స్


ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల


కృష్ణానగర్‌లో కార్పొరేటర్ రాజ్‌కుమార్...


గాయత్రీహిల్స్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్


ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి పక్కన వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకురాలు విజయారెడ్డి


ఖైరతాబాద్‌లో యూత్ వింగ్ ఆధ్వర్యంలో...


మామిడి పండ్ల అలంకారంలో నందినగర్ శ్రీ ఆంజనేయ స్వామి


వెంగళరావునగర్ రామాంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న చైర్మన్ సుజాత, భక్తులు


నందినగర్‌లో ఆకుపూజ నిర్వహిస్తున్న భక్తులు


పూజల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్లు కంజర్ల సదాశివయాదవ్, కిలారి మనోహర్

సాఫీగా హనుమాన్ విజయయాత్ర

వర్షంతో భక్తులకు తప్పని ఇబ్బందులు


నారాయణగూడ వైఎంసీఏ వద్ద హనుమాన్ విజయయాత్ర

హిమాయత్‌నగర్: హనుమాన్ విజయ యాత్ర నారాయణగూడ పరిసర ప్రాంతాల్లో సాఫీగా సాగింది. గురువారం మధ్యాహ్నం గౌలిగూడ నుంచి నారాయణగూడ వైఎంసీఏ ప్రాంతానికి యాత్ర కొనసాగింది. ఈ నేపథ్యంలో భారీ వర్షం కురవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా యాత్రను తిలకించేందుకు వచ్చిన భక్తులు వెనుదిరిగారు. శోభా యాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయమైన ఘటనలు చోటు చేసుకోకుండా నారాయణగూడ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

తప్పను కప్పిపుచ్చుకునేందుకే బీజేపీ నేతల విమర్శలు

ఎమ్మెల్యే దానం నాగేందర్



వెంకటేశ్వరకాలనీ: పదో తరగతి పరీక్షా ప్రశ్నా పత్రాల లీకేజీ వ్యవహారంలో చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు బీజేపీ నేతలు రాష్ట్ర ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. గురువారం ప్రతాప్‌నగర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసే లక్ష్యంతో బండి సంజయ్ నేతృత్వంలో పదో తరగతి పరీక్షా పత్రాలు లీకేజీ అయ్యాయంటూ జనాన్ని గందరగోళ పరిచే ప్రయత్నాలు జరిగాయనే విషయాన్ని పోలీసులు దర్యాప్తు చేసిన అనంతరం తేల్చారన్నారు. బండి సంజయ్‌కి ఇతర నిందితులకు జరిగిన సంభాషణలు, సంబంధాల ఆధారంగానే పోలీసులు అతడిని ప్రధాన నిందితుడిగా చేర్చారని అన్నారు. ఇవన్నీ స్పష్టంగా ఉన్నప్పటికీ ఢిల్లీ నుంచి గల్లీదాకా బీజేపీ నేతలు అవాకులు పేలుతున్నారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రాములు చౌహాన్, టీఎమ్మార్పీఎస్ యువసేన అధ్యక్షుడు నల్ల శివ మాదిగ, మాజీ కార్పొరేటర్ భారతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పక్షుల దాహార్తి తీర్చేందుకు తొట్టెల పంపిణీ


తొట్టెను పంపిణీ చేస్తున్న రవి

బంజారాహిల్స్: వేసవిలో పక్షులకు అందుబాటులో నీళ్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతుంటాయి. మూగ ప్రాణులపై జాలిచూపిన రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ప్రతినిధులు ఖర్చుకు వెనుకాడకుండా రోడ్ల పక్కన, తమ ఇంటి ముందు భాగంలో ఏర్పాటు చేసుకునేలా నీళ్ల తొట్టెలను పంపిణీ చేశారు. సుమారు వంద వరకు నీళ్ల తొట్టెలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ప్రెసిడెంట్ రవి మాడభూషి మాట్లాడుతూ... సేవాదృక్పథంతో తాము తొట్టెలను అడిగిన అందరికీ అందజేశామన్నారు.

'రానున్నది బీజేపీ ప్రభుత్వమే'



హిమాయత్‌నగర్: భారతీయ జనత పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని హిమాయత్‌నగర్ డివిజన్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. హిమాయత్‌నగర్‌లో ఆ పార్టీ జెండాను రాష్ట్ర నాయకుడు రామన్‌గౌడ్, కార్పొరేటర్ మహాలక్ష్మి గౌడ్ ఆవిష్కరించారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలోనూ బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని రామన్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

మానసిక రోగుల హక్కులకు సంరక్షణ

సీనియర్ సివిల్ జడ్జి మురళీమోహన్



శ్రీనగర్‌కాలనీ: మానసిక రోగుల హక్కులను లీగల్ ఎయిడ్ క్లినికల్ పరిరక్షిస్తుందని సిటీ సివిల్ కోర్టు న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె. మురళీమోహన్ అన్నారు. కోవిడ్ తదనంతరం ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలో లీడల్ ఎయిడ్ క్లినిక్ సేవలను నిలిపివేశారు. గురువారం ఆయా సేవలను న్యాయమూర్తి పునఃప్రారంభించారు. మానసిక రోగుల హక్కులు, వారికి దక్కాల్సిన పరిహారాలను అందించడానికి తాము కృషి చేస్తామన్నారు. న్యాయవాదులు వేణుగోపాలరావు, మంజులగౌడ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉమాశంకర్, డాక్టర్ మనోహర్, డాక్టర్ అనిత, శిరీష పాల్గొన్నారు.

ప్రహరీ కూల్చిన వ్యక్తిపై కేసు నమోదు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని కౌశిక్ కో ఆపరేటివ్ సొసైటీ కాలనీలో తన ప్లాట్ ప్రహరీని కూల్చివేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేశారు. వివరాలివీ... ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌లో నివసించే జి. శ్వేతారెడ్డికి బంజారాహిల్స్‌లోని కౌశిక్ కో ఆపరేటివ్ సొసైటీలో ప్లాట్ నెం.55 ఉంది. ఇదే ప్రాంతంలో నివసిస్తున్న జితేందర్ అగర్వాల్ అనే వ్యక్తి తన ప్లాట్‌కు తూర్పుభాగంలో ప్రహరీని కూల్చివేసి తమను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ప్రశాంతంగా ఉన్న తమను ఆందోళనకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాము ఈ ప్లాట్‌ను గిఫ్ట్ డీడ్ చేసుకున్నామని సంబంధిత పత్రాలను అందజేశారు. జితేందర్ అగర్వాల్ తమ ప్లాట్ ప్రహరీని అన్యాయంగా కూల్చివేసి కబ్జా చేసేందుకు యతిస్తున్నారని ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై ఐపీసీ సెక్షన్ 447, 427 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆయుర్వేదంలో మార్పులను స్వాగతించాలి

వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య


ఆస్పత్రి వార్షికోత్సవానికి హాజరైన కార్పొరేటర్ దేదీప్య తదితరులు

వెంగళరావునగర్: ఆయుర్వేదంలో చోటు చేసుకుంటున్న మార్పులను స్వాగతిస్తూ ఆ వైద్య విధానాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రస్తుత వైద్య విద్యార్థులపై ఉందని వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ తెలియజేశారు. ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల 83వ వార్షికోత్సవం గురువారం కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ దేదీప్య మాట్లాడుతూ... దేశం గర్వించదగ్గ వైద్యం ఆయుర్వేదమని పేర్కొన్నారు. ఇది చాలా దేశాల్లో సైతం విస్తరించిందని... ఈ పద్ధతుల ద్వారానే పలు దీర్ఘకాలిక వ్యాధులను నయం చేస్తున్నారని అన్నారు. మన దేశ వైద్యానికి ఇతర దేశాల్లో ఎంతో ఆదరణ ఉందని, అయితే ఇక్కడ ఆశించిన స్థాయిలో ఆదరణ లేకపోవడం దురదృష్టకరమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనసూయ మాట్లాడుతూ... దీర్ఘకాలిక రోగాలను సైతం ఆయుర్వేదం ద్వారా నయం చేయవచ్చన్నారు. వైద్య విధానంలో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవన్నారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలను నిర్వహించి విజేతలకు బహుమలను ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఉమాశ్రీనివాస్, డాక్టర్ రమాదేవి, స్టూడెంట్ అడ్వైజర్స్ డాక్టర్ బాబూరావు, డాక్టర్ స్వరూప, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామచంద్రారెడ్డి, వైద్యులు డాక్టర్ పి.యశోద, డాక్టర్ నర్సింహా తదితరులు పాల్గొన్నారు.